## క్లుప్తంగా

### పాఠశాల భవనం పరిశీలన



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఈ, ఎంపీడీఓ

**శిరివెళ్ల:** స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం డిప్యూటీ ఈఈ శంకరప్రసాదు పరిశీలించారు. తరగతి గది శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. అంతవరకు విద్యార్థులకు కాలనీలోని చర్చిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఉన్నారు.

### మొక్కజొన్న రైతులను ఆదుకోండి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

**రుద్రవరం:** మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల మొక్కజొన్న పంట దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆయన తహసీల్దారు అల్‌ఫ్రెడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు గుర్రెడ్డి, సహాయ కార్యదర్శి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు జి.శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాట రాయుళ్ల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

**రుద్రవరం:** మండల పరిధిలోని నక్కలదిన్నెలో సోమవారం 9మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ రఫి తెలిపారు. గ్రామంలో కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచామన్నారు. పేకాట ఆడుతుండగా 9 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ రాంభూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**కొలిమిగుండ్ల:** రాష్ట్ర స్థాయి రన్నింగ్ రేస్‌లో ప్రతిభ చూపిన మోడల్ స్కూల్ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి సోమవారం తెలిపారు. గత నెల 25,26 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 600 మీటర్ల రన్నింగ్ రేస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని లక్ష్మీకాంతి పాల్గొంది. ఈ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. త్వరలో ఒడిస్సాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

### పల్లకీలో విహరించిన ఆది దంపతులు



పల్లకీసేవలో మహానందీశ్వర దంపతులు

**మహానంది:** మహానందీశ్వరుడి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాం భట్, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళ హారతులు, బలిహరణ అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం జరిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### వేతన బకాయిలు చెల్లించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**నంద్యాల (న్యూటౌన్):** నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న దాదాపు 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు మంజూరు చేయాలని సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ గౌస్, వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ప్రసాద్ మాట్లాడుతూ హాస్పిటల్ సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఫాతిమా, మహేష్, రాజమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

### కనీస వేతనం ఇవ్వాలి



ఆసుపత్రి సూపరింటెండ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

**నంద్యాల (న్యూటౌన్):** ఆశా వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి సూపరిండెంట్ గురుస్వామికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఆశా వర్కర్ల వేతనాలు పెంచుతామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. గిరిజన గూడెంలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని కోరారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షమీం శివమ్మ, శిరోమణి, వసంత, సోని పాల్గొన్నారు

# రైతుల కష్టం వర్షార్పణం

- చాగలమర్రిలో 75.2 మి.మీల వర్షం





చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో ప్రవేశించిన వర్షపు నీరు, ముత్యాలపాడులో ఆరబెట్టుకున్న మొక్కజొన్న దిగుబడులు తడిసిపోయిన దృశ్యం

**చాగలమర్రి:** రైతుల కష్టం వర్షార్పణమైంది. సోమవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షాలకు పంటలన్నీ నీట మునిగాయి. జిల్లాలోనే చాగలమర్రి మండలంలో అత్యధికంగా 75.2 మి.మీటర్ల వర్షం నమోదైంది. మండలంలో 4,800 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా పంట కోత దశలో ఉండటంతో సుమారు 60 శాతం మందికి పైగా రైతులు పంటను నూర్పిడి చేసి రోడ్లపై ఆరబెట్టారు. సోమవారం భారీ వర్షానికి మొక్కజొన్న ధాన్యం వర్షపు నీళ్లలో తడిసిపోయాయి. కొన్నిచోట్ల గింజలు నీళ్లలో కొట్టుకుపోయాయి. గింజలను కాపాడుకోవటానికి రైతులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ముత్యాలపాడు గ్రామానికి సమీపంలో ఉన్న అహోబిళం మఠమొల్ల చెరువు నిండి పంటపొలాలను ముంచెత్తింది. చెరువు గ్రామంలోని మొయిన్ రోడ్డు గుండా ఎస్పీజీ ఉన్నత పాఠశాల ఆవరణంలోకి చేరాయి. అక్కడ ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు వర్షపు నీటిలో తడిసిపోయాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోనికి వర్షపు నీరు చేరడంతో సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. ముత్యాలపాడు బస్టాండు, గాంధీ సెంటర్, పాత హైవే రోడ్డుపై ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద మురుగు కాలువలు నిండి రోడ్లపై ప్రవహించాయి. గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల వద్ద భవనాశి, అడ్డువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రాహ్మణపల్లె వద్ద వక్కిలేరు వంతెనపై నుంచి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది.

**రాజోలి ఆనకట్ట వద్ద 6,923 క్యూసెక్కుల ప్రవాహం**

చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 6,923 క్యూసెక్కుల నీటి ప్రవహంతో కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తున్నట్లు కేసీసీ ఏఈ జమాల్‌వలి తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి కుండపోతగా కురిసిన వర్షానికి కుందూకు భారీగా వరద నీరు వచ్చి చేరిందన్నారు. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కెనాల్‌కు 570 క్యూసెక్కులు, చాపాడు ఛానల్‌కు 97 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.



రాజోలి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

**నష్టపరిహారం ఇవ్వాలి**



ఐదెకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. ఎకరాకు రూ.40,000 చొప్పున ఐదెకరాలకు రూ2 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. కోత కోసి కుప్ప నూర్చి రేపు విక్రయించాలనే ఉద్దేశంతో ఆరబెట్టుకున్నాను. అంతలోనే వర్షం వచ్చి పూర్తిగా నష్టం కలిగించింది. ప్రభుత్వమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– రమణయ్య, రైతు, ముత్యాలపాడు గ్రామం

**తక్కువధరకు అడుగుతారు**



విత్తు వేసినప్పటి నుంచి కష్టపడి కాపాడుకుంటూ వచ్చాం. చేతికందిన దిగుబడులు వర్షానికి తడిసిపోయాయి. తడిసిన దిగుబడులను వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు అడుగుతారు. ప్రభుత్వమే మద్దతు ధరతో తడిసి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– పి.మధు రైతు, గొడిగనూరు గ్రామం

## ప్రయాణికులు ఫుల్.. బస్సులు నిల్!



ఫుట్‌డోర్ ప్రయాణం ఉండటంతో ఎక్కలేక నిలిచిన పోయిన ప్రయాణికులు

**దొర్నిపాడు:** ప్రయాణికులకు తగ్గట్టు ఆర్టీసీ అధికారులను బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడం లేదు. దీంతో నాలుగు రోజులుగా ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఏ మాత్రం కాలు పెట్టేందుకు కూడా స్థలం పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట వద్ద నుంచి ఆళ్లగడ్డ వెళ్లేందుకు ప్రయాణికులు సోమవారం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బస్సులన్నీ బస్టాండ్‌లనే నిండిపోయి వస్తుండటంతో మరో స్టేజీ వద్ద ఎక్కే ప్రయాణికులకు కనీసం సీటు దొరకని పరిస్థితి ఏర్పడింది. మహిళలకు ఉచితం అంటూనే బస్సు సర్వీసులను తగ్గించడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వీరశైవులను మోసం చేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న రాజప్ప

**నంద్యాల (వ్యవసాయం):** శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యుల్లో నంద్యాల జిల్లాకు చెందిన వీరశైవులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపడంపై జిల్లా వీరశైవ ఐక్యవేదిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్నూలు రాజప్ప మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో శ్రీశైలం, మహానందితో పాటు వివిధ శైవ క్షేత్రాల్లో పాలక మండల చైర్మన్లు, బోర్డు సభ్యులుగా వీరశైవులకు ప్రాధాన్యత ఇస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇటీవల శ్రీశైలం బోర్డులో వీరశైవులకు అవకాశం కల్పించాలేదన్నారు. తమను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. నాయకులు శ్రీనివాసులు, కిషోర్, మల్లికార్జున,నాగ పుల్లయ్య,ప్రసాద్ పాల్గొన్నారు.

### పంచమఠాల్లో విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహించిన దృశ్యం

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయ బద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు, ఏఈఓ హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.

### ● ఎస్సార్బీ'ఛీ'..!



ఎస్సార్బీసీలో పేరుకుపోయిన పాచి, చెత్తాచెదారం

కోవెలకుంట్ల పట్టణ శివారులోని గుంజపాడు రహదారిలో ఉన్న ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వ నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. కాల్వలో చెత్తాచెదారం, పాచి పేరుకుపోయి కల్వర్టు వద్ద అడ్డుపడింది. కాల్వ నిండా వ్యర్థాలు చేరడంతో నీటి విడుదలకు అడ్డంకిగా మారింది. ఎస్సార్బీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని పాచి, చెత్తాచెదారం తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలని రైతులు కోరుతున్నారు. –కోవెలకుంట్ల



గుంజలపాడు రహదారిలో కల్వర్టు వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన వ్యర్థాలు

### స్వచ్ఛ అవార్డులకు రెండు గ్రామైక్య సంఘాల ఎంపిక

**శిరివెళ్ల:** మండలంలో రెండు పొదుపు గ్రామైక్య సంఘాలు స్వచ్ఛ అవార్డులకు ఎంపికయ్యాయని ఏపీఎం రాజశేఖరరెడ్డి సోమవారం తెలిపారు. తమ గ్రామాలలో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మహిళలను చైతన్య పరిచిన వీరారెడ్డిపల్లెలోని శివజ్యోతి, వెంకటేశ్వరపురంలోని శ్రీరామ గ్రామైక్య సంఘాలు స్వచ్ఛ అవార్డులకు ఎంపికయ్యారన్నారు.

### పాఠ్యపుస్తకాల మంజూరు

**శిరివెళ్ల:** స్టెప్ 2 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతులకు 4,739 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయన్నారు. ఆయా పాఠశాలలకు చేరవేసి, నవంబర్ నుంచి సెమిస్టర్ 2 పుస్తకాల పాఠ్యాంశాలను టీచర్లు బోధించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### కుందూలో మృతదేహం గుర్తింపు

**నంద్యాల(అర్బన్):** కుందూనదిలో ఓ పురుష మృతదేహం కొట్టుకొనివచ్చి మండలంలోని భీమవరం గ్రామ సమీపంలోని వంతెన వద్ద నిలిపోవడాన్ని నంద్యాల రూరల్ పోలీసులు గుర్తించారు. సోమవారం మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు మాట్లాడుతూ.. సాయిబాబా మెటల్ డాలర్, కాషాయపుగధ మృతుడి మెడలోఉన్నాయని, కుడి చేతికి అమ్మ అనే పచ్చ బొట్టువేసి ఉందన్నారు. నెల రోజుల నుంచి ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి తప్పి పోయి ఉంటే నంద్యాల తాలూకా సీఐ సెల్ 91211 01092,99858 65553 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

### 9న మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

**నంద్యాల(న్యూటౌన్):** స్థానిక ఇండోర్ స్టేడియంలో మండలస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ జనార్ధన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18, 20 తేదీ వరకు జరిగే డివిజన్ స్థాయి ఎంపికలో పాల్గొంటారని పేర్కొన్నారు.

### మొరాయించిన వీడియో పరికరం

**ఉయ్యాలవాడ:** మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్(వీసీ) సెట్ సోమవారం మొరాయించింది. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ సెట్ పని చేయకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. దీంతో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై ఎంపీడీఓ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా ఏపీ స్వామ్ సాంకేతిక కారణాల వల్ల పని చేయకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

### నేడు శిక్షణ తరగతులు

**ఉయ్యాలవాడ:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

### గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

**వెలుగోడు:** పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడగూగూరు వైద్యాధికారి ఎం.సుమన్ సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా సోమవారం రేగడ గూడూరు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య, గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ కష్టారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూ కొన్ని పశువుల్లో మొదటి ఎద వయసు వచ్చినా ఎదకు రాకుండా ఉంటాయన్నారు. దీనికి గర్భకోశం ఎదగకపోవడం కారణం కావచ్చన్నారు. పశువులు ఎదకు రాకపోతే వైద్యులకు చూపించి గర్భకోశం ఎదుగుదల పరీక్షలు చేయించి, తగిన చికిత్సలు చేయించాలన్నారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## ఎండాకు తెగులుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతుకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

**బండి ఆత్మకూరు:** వరి పంటకు సోకిన ఎండు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్. పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన సోమయాజుపల్లి, ఈర్నపాడు గ్రామాల పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వరి పంటకు ఎండాకు తెగులు, తుప్పు తెగులు, పొడ తెగుళ్ల ఆశించాయన్నారు. ఎండాకు తెగులు నివారణకు ఎకరాకు 500 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పిచికారీ చేయాలని, పొడ తెగులుకు 400 గ్రాముల హెగ్జా కోనాజోల్‌ను, తుప్పు తెగులుకు ఎకరాకు కార్బండజైమ్‌ను 250 గ్రాములు 15 రోజులకోసారి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

### భ్రామరీకి లక్షకుంకుమార్చన



కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా రాలేని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహా రాష్ట్రలకు చెందిన 19 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా సేవను నిర్వహించుకున్నారు. ముందుగా అర్చకులు పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

## మహానందీశ్వరస్వామి సన్నిధిలో ప్రముఖులు

**మహానంది:** మహానందీశ్వరస్వామి సన్నిధిలో సోమవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. బెంగుళూరు అడిషనల్ ఎస్పీ దీపక్, జెన్‌కో చీఫ్ ఇంజినీర్ తిరుమల ప్రసాద్ వేర్వేరుగా మహానందికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

## స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

**శ్రీశైలంటెంపుల్:** పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలోని స్వామిఅమ్మవార్లకు సోమవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పల్లకీ, ఊయల సేవలను నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు జరిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన కార్లు

**శిరివెళ్ల:** నంద్యాల- ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల పెట్రోల్ బంక్ వద్ద సోమవారం మూడు కార్లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన వారు కారులో అరుణాచలం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఘటనా స్థలం వద్దకు చేరుకోగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి నంద్యాల నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న మరో కారును ఢీకొంది. అదే సమయంలో నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఇంకో కారు వేగంగా వచ్చి ముందు కారును ఢీకొంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన భీమలింగం, అతని భార్య చంద్రకళ, ప్రొద్దుటూరు యాక్సిస్ బ్యాంక్ ఉద్యోగి శివశంకర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ చిన్న పీరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బ్యాంక్ ఉద్యోగి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్ళగడ్డ
70750 09218 (నంద్యాల)
70750 09103 (ఆళ్ళగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com